## క్లుప్తంగా

### నేడు శంబర పోలమాంబ నాలుగో జాతర


శంబరపోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాలుగో జాతర మంగళవారం జరగనుంది. ఈఓ వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులు సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదం సిద్ధం చేశారు. క్యూలైన్ల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. సాలూరు సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి పట్టణాల నుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది.

### కూర్మరాజుపేటలో అగ్ని ప్రమాదం


కాలిపోతున్న గడ్డి కుప్పలు

సాలూరు: మండలంలోని కూర్మరాజుపేట సమీపంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక అధికారి బి.పైడిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట ఈశ్వరరావు సుమారు రెండు ఎకరాలకు చెందిన గడ్డి కుప్పలను కళ్లంలో ఉంచగా... అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

### డీటీఓ గణేష్ మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న ఖజానా శాఖ సిబ్బంది

పార్వతీపురం: విజయనగరం జిల్లా ఖజానా శాఖాధికారి ఎస్ఆర్‌కే గణేష్ మృతిపట్ల పార్వతీపురం జిల్లా ఖజానాశాఖ అధికారులు, సిబ్బంది సోమవారం నివాళులర్పించారు. పార్వతీపురం డీటీఓ ఎ.మన్మథరావు, అడిషనల్ డీటీఓ కె. శ్రీనివాసరావు తదితరులు గణేష్ మృతికి సంతాపం తెలిపారు.

### చిట్టీల వ్యాపారి టోకరా..


బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై పాపారావు

సాలూరు: చిట్టీల వ్యాపారి టోకరా పెట్టి పరారైన సంగతి వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలియజేసిన వివరాల మేరకు... పట్టణంలో గొర్లెవీధికి చెందిన మండవల్లి సోమశేఖర్ చిట్టీలు వేసేవాడు. మొదట్లో నమ్మకంగా వ్యవహరించడంతో ఎక్కువ మంది ఇతని వద్ద చిట్టీలు కట్టేవారు. కొద్ది రోజుల కిందట నుంచి సోమశేఖర్ కనిపించకుండా పోయాడు. సుమారు 11 లక్షల రూపాయలు నష్టపోయినట్లు బాధితులు ఆరోపిస్తూ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

### 26న ప్రజ్ఞా వికాసం పరీక్ష


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: ఈ నెల 26న మండలాల వారీగా ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజ్ఞా వికాసం పరీక్షలో పదో తరగతి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పండు, వరుణ్ కోరారు. బంగారమ్మపేట పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. పరీక్షలో పాల్గొనాలనుకునే వారు 25 రూపాయల ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 76010 37266 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రంజిత్‌కుమార్, లోకేష్, ఇస్సాక్, తదితరులు పాల్గొన్నారు.

### సోషల్ మీడియా కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ

భామిని: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో–కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. భామిని మండల కన్వీనర్‌గా ఎరుకుమజ్జి లక్ష్మీనారాయణ(శ్రీను), కో–కన్వీనర్లుగా తామరసిల్లి సురేష్, నిమ్మల త్రినాథ్, సరసాభద్ర రాజ్‌కుమార్, మలగాం కృష్ణలను నియమించింది.

# కాలిబాటలతో అధిక దిగుబడి

- వరిసాగులో ఖర్చు ఆదా
- సస్యరక్షణ సులభం


బల్లి గ్రామంలో పంటపొలంలో కాలిబాటలను పరిశీలిస్తున్న అధికారులు

బలిజిపేట:

వరిసాగులో కాలిబాటలు వేసి ఊభాలు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి వ్యవయం తగ్గి దిగుబడి పెరుగుతుందని అంటున్నారు. చాలామంది రైతులు కాలిబాటలు వేయడానికి ఇష్టపడరు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తారు. అయితే రైతులు తప్పనిసరిగా వరిచేలల్లో కాలిబాటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**కాలిబాటలు వేసే విధానం**

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపు వరకు సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్నచోట వాటిని నాటుకోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగుదూరంలో కాలిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక కాలిబాట వేయాలి. కొందరు రైతులు ప్రతి 6నుంచి 7మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీంతో ప్రయోజనం సమకూరదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలను తీసివేసి కాలిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో పైరు ఎదుగుతున్న సమయంలో 15నుంచి 20రోజుల వ్యవధిలో 20సెంటీమీటర్ల వెడల్పులో వరినాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.

**ప్రయోజనాలు**

కాలిబాటతో పైరు మొదళ్ల వరకు వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది.

- చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగులును గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు కాలిబాటలు ఉపయోగపడతాయి. తుపాన్లు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేల్లో మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చేపట్టే వీలు కలుగుతుంది.

**ఎంతో ప్రయోజనం**

కాలిబాటలు వేయడం వల్ల దిగుబడి పెరుగుతుంది. సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయి. వ్యవసాయ నిపుణుల సలహాలను రైతులు పాటించాలి.
శ్రావణ్, ఏఓ, బలిజిపేట మండలం

# ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జి.ఆశాలత

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో వైద్యం చేయించుకోలేని పేదలకు ఇళ్ల వద్దనే మెరుగైన వైద్య సేవలందించడం సంతృప్తి నిచ్చిందని ఆర్‌సీహెచ్ డాక్టర్ జి.ఆశాలత అన్నారు. ఈ మేరకు సోమవారం కామందొరవలసలో ఫ్యామిలీఫిజీషియన్ విధానంలో 104 సంచార వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బీపీ, సుగర్, కీళ్లనొప్పులు, క్షయ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికి గ్రామానికి వచ్చిన 104 సంచార వైద్య కేంద్రంలోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధిని నిర్ధారించి, నివారణకు అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 104 వాహనంలో 14 రకాలవ్యాధుల నివారణకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని రోగులకు నెలకు సరిపడ మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అన్ని రకాలవ్యాధుల నివారణకు అవసరమైన మందులు సమకూర్చడం వల్ల ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులనుంచి మంచిఫలితాలు వస్తున్న కారణంగా అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే గర్భిణులు దూరప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు వెళ్లి వైద్యపరీక్షల కోసం వ్యయప్రయాసల కోర్చి ఇబ్బందులు పడుతున్నందున 104 వాహనంలో ల్యాబ్ అమర్చి ఉన్నందున స్థానికంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగుసూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. వెంకటాపురంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 74 మందికి వైద్యసేవలు అందించామన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### 80 లీటర్ల సారా స్వాధీనం

పాచిపెంట: ఓ వ్యక్తి నుంచి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన గుణాన దాసు అనే వ్యక్తి ఒడిశా నుంచి పాచిపెంట వైపు ద్విచక్రవాహనంపై 80 లీటర్ల సారా తరలిస్తుండగా పాచిపెంట వద్ద పట్టుబడ్డాడు. సారా స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనం సీజ్ చేయడంతో పాటు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

### 15న రహదారి భద్రత కమిటీ సమావేశం

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రవాణాశాఖాధి సి.మల్లికార్జున రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో శాఖల వారీగా చేపట్టాల్సిన రహదారి భద్రతా కార్యక్రమాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని రహదారి భద్రతా కమిటీ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

### ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సమాయత్తం కావాలి


తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలు చేయడానికి, ఎన్నిక నిర్వహించడానికి మండలంలోని రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు సమాయత్తం కావాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహించే పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 16న వెలువడుతుందన్నారు.16 తేదీ నాటి నుంచి ఎన్నికలైనంతవరకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందన్నారు.అలాగే పోలింగ్ నిర్వహించాల్సిన కేంద్రాలలో ఓటర్లకు మౌలిక సదుపాయాల కల్పన, ప్రశాంతంగా ఎన్నిక నిర్వహించడానికి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలియజేశారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సమగ్ర భూరక్ష, భూ హక్కు పథకం ద్వారా రీసర్వే వేగవంతం చేయడానికి అవగాహన కల్పించారు. వీఆర్వోలు రీసర్వే విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ చిట్టమ్మ, ఆర్ఐ పి.కరుణాకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

### రేప్ కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని బిటివాడ గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై రేప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ సోమవారం తెలిపారు. తనకు మాయమాటలు చెప్పి గత కొంతకాలంగా శారీరకంగా తనపై దాడిచేస్తూ ఇబ్బంది పెడుతున్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై సీఐ మురళీధర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

# మర్యాదపూర్వక కలయిక


సోషల్ మీడియా కో కన్వీనర్లకు అభినందనలు తెలియజేస్తున్న రంగునాయుడు

మక్కువ: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడును వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కో కన్వీనర్లుగా కొట్నాన ధనుంజయరావు, శంబంగి భానుప్రసాద్, తెర్లి మహేష్, బూరాడ మణికంఠ, రౌతు సత్యానారాయణలను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.

ఈ మేరకు కో కన్వీనర్లందరూ రంగునాయుడును అతని స్వగృహంలో కలవగా.. ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పనిచేయాలని సూచించారు.

# అనారోగ్యంతో విద్యార్థినుల మృతి


కోలక సుమిత్ర (ఫైల్)


కొండగొర్రి పవిత్ర (ఫైల్)

సీతంపేట: కొమరాడ, సీతంపేట మండలాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సీతంపేట మండలంలోని పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని కొండగొర్రి పవిత్ర(15) అనారోగ్యంతో మృతి చెందింది. విద్యార్థిని గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, గత నెల 28న పాఠశాల సిబ్బంది ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించినట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్ తెలిపారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందినట్టు చెప్పారు. విద్యార్థిని దహన సంస్కారాల ఖర్చులకు రూ.5వేలు చెల్లించనున్నామన్నారు.

**కొమరాడలో..**

కొమరాడ: మండలంలోని ఉలిపిరి గిరిజన బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కోలక సుమిత్ర అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విద్యార్థినికి ఆదివారం మెడనొప్పి రావడంతో తల్లిదండ్రులు కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్యం అందించారు. ఫిట్స్ ఉందని, మెరుగైన వైద్యం అవసరమని అక్కడి వైద్యులు పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఎంఆర్ఐ స్కాన్ చేయించాల్సి రావడంతో అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే వసతిగృహంలో విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ లేకపోవడంతోనే విద్యార్థిని మృతి చెందిందని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

# భారీ కంటైనర్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం


ఏబీరోడ్డులో ప్రయాణిస్తున్న భారీ కంటైనర్

భామిని:

మండలంలోని ఏబీ రోడ్డులో నిత్యం భారీ వాహనాల రాకపోకలతో వాహన చోదకులకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. విశాఖపట్నం షిప్‌యార్డు నుంచి ఏబీరోడ్డు మీదుగా ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న భారీ కంటైనర్ వాహనం సోమవారం రోడ్డుపక్కన కాసేపు నిలుపుదల చేశారు. సుమారు 108 టైర్లు కలిగిన ఈ భారీ వాహనాన్ని స్థానికులు ఆసక్తిగా చూశారు. అయితే ఏబీరోడ్డులో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు పాడవుతోందని పలువురు ప్రయాణికులు అంటున్నారు.

# సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సెర్ప్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రారంభించిన సామాజిక తనిఖీ నిమిత్తం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ, సాంకేతిక సహాయకులతో సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు ముందుగా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020–2021, 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఉపాధిహామీ పనుల్లో గిట్టుబాటు వేతనం, వేతనదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, గృహనిర్మాణ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు, పింఛన్ల పంపిణీలో లోపాలపై సెర్ప్ సీఈఓ పర్యవేక్షణలో డీఆర్పీలు గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహిండానికి వస్తున్నారన్నారు. ఆ సిబ్బందికి శాఖాపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయోనన్న సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ నాగలక్ష్మి, సంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ చేయూతపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఏడీఏ సీహెచ్ దీనకుమార్

- ఏడీఏ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: మహిళా పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ చేయూత పథకంలో ఎక్కువ మంది సభ్యులుగా చేరడానికి మహిళలకు పశువైద్య సహాయకులు అవగాహన కల్పించాలని పశువైద్య శాఖ సబ్‌డివిజనల్ ఏడీఏ సీహెచ్ దీనకుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం సీతానగరం సబ్‌డివిజన్ కార్యాలయం ఆవరణలో బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారులు జి.గణేష్, ఎస్.రామారావుల ఆధ్వర్యంలో రైతుభరోసా పశువైద్య సహాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ దీనకుమార్ మాట్లాడుతూ పాడిపశువుల పెంపకం కోసం వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా వెలుగు అధికారులు రూ.18,500 సమకూరుస్తున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్ చేయూత పథకంలో లబ్ధిదారుల సంఖ్య పెంచడానికి మహిళా సంఘాల సభ్యులను చైతన్య పర్చాలని కోరారు. అలాగే మండలంలోని గొర్రెలు, మేకలకు వచ్చే పీపీఆర్ వ్యాధినివారణకు ముందుజాగ్రత్త చర్యగా వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. పీపీఆర్ వ్యాక్సిన్ వేసిన పశువైద్య సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చాలని కోరారు. అలాగే పశువుల్లో వచ్చే లంపి స్కిన్ (బొబ్బరవ్యాధి) డిసీజ్ నివారణకు ముందుజాగ్రత్త చర్యగా వేస్తున్న వ్యాక్సిన్‌ను రహదారులను ఆనుకుని ఉన్న గ్రామాల రైతులు పశువులకు విధిగా వేయించాలని కోరారు. కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం వైద్యసహాయకులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎంఎల్) మహాసభలను
# విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి పి.సంగాం

సీతానగరం: బీహార్ రాజధాని పాట్నాలో ఫిబ్రవరిలో జరగనున్న సీపీఐ(ఎంఎల్) 11 వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి సంగాం కోరారు. ఈ మేరకు ఫిబ్రవరి 15 నుంచి 20 వరకూ బీహార్‌లో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీతానగరం మండలకేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో గిరిజన, హరిజన, బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి, లౌకిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి జాతీయస్థాయి నాయకులు చర్చిస్తారని చెప్పారు. సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ 11వ మహాసభలకు పార్టీ నాయకులు, అభిమానులు, సానుభూతి పరులు,ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) పాలకొండ, పార్వతీపురం ప్రాంతాల నాయకులు బి.వెంకటరమణ, జి చిన్నారావు, భారతి, ప్రమీల, మల్లిక, ఉర్లక విజయకుమారి, నరేంద్ర పాల్గొన్నారు.

# పెండ్లికుమార్తెకు కానుక..


పెళ్లికుమార్తె వెంకటలక్ష్మికి కానుక అందిస్తున్న ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు

మక్కువ:

మండలంలోని వెంకటభైరిపురం గ్రామానికి చెందిన పెండ్లికుమార్తె యడ్ల వెంకటలక్ష్మికి ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు సోమవారం పెండ్లికానుకలో భాగంగా చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాలుగేళ్లగా పెళ్లికానుకగా చీర, జాకెట్, పదివేల రూపాయలు అందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# బాలల రక్షణ కమిటీ ఏర్పాటుకు చర్యలు


ఎంపీపీకి కమిటీ విధివిధానాలను వివరిస్తున్న సీడీపీఓ

పాలకొండ రూరల్:

మండల స్థాయి బాలల రక్షణ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీఓ గీత పేర్కొన్నారు. సోమవారం ఎంపీపీ బొమ్మాళి భానును కలిసి కమిటీల ఏర్పాటు, అందులో సభ్యులు, వారు నిర్వహించాల్సిన విధులపై చర్చించారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ, సభ్యులుగా జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, కన్వీనర్‌గా సీడీపీఓ, మెడికల్ ఆఫీసర్, ఎస్సై, ఎంఈఓతోపాటు ఎంఎంఎస్ అధ్యక్షులు, ఐకేపీ అధికారులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, యువసజ సంఘం సభ్యులు ఉంటారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ మేరి తదితరులున్నారు.

# బోదవ్యాధి నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫైలేరియా నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర ఉప సంచాలకుడు ఎ.టి రామనాథరావు

పార్వతీపురం టౌన్:

బోదవ్యాధి నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర ఉప సంచాలకుడు ఎ.టి రామనాథరావు అన్నారు. జిల్లా ఆస్పత్రి సమావేశ భవనంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు ఆధ్వర్యంలో సోమవారం హెల్త్ సూపర్‌వైజర్‌లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదవ్యాధి పూర్తిస్థాయి నిర్మూలన లక్ష్యంగా ఈ నెల 15వ తేదీన బోదవ్యాధి నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వారందరికీ డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు వైద్య సిబ్బంది వేస్తారని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. గర్భిణులు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారికి ఈ మందులు ఇవ్వరాదని, ఖాళీ కడుపున మాత్రలు వేయరాదని సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మాట్లాడుతూ ఫైలేరియా నివారణ మందులు జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశామని, తదితర శాఖల సమన్వయంతో జిల్లాలో పూర్తి స్థాయిలో కార్యక్రమం నిర్వహించి ఫైలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఎం.తులసి, డీఐఓ టి.జగన్మోహనరావు, డీటీసీఓ శ్యామ్ కుమార్, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, ఏఎంఓలు డీవి రమణ, సూర్యనారాయణ, కన్సల్టెంట్ జి రామచంద్ర, ఎన్‌జీఓ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.